కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు

- యథేచ్ఛగా కోళ్లు, జంతు వ్యర్థాల రవాణా
- కొన్ని రకాల చేపలకు మేతగా వినియోగం
- ప్రజారోగ్యంతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


నిడదవోలులో చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను ఆటోలో ఎగుమతి చేస్తున్న దృశ్యం

నిడదవోలు : కోళ్ల వ్యర్థాల రవాణా, చేపల మేతగా వినియోగం ప్రజారోగ్యం, పర్యావరణానికి హానికరమైంది. ఈ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేయడం వల్ల నీటి కాలుష్యం, వ్యాధుల వ్యాప్తి తద్వారా ఆర్థిక నష్టం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. నిడదవోలు నియోజకవర్గంలోని చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను అక్రమార్కులు అడ్డూఅదుపు లేకుండా రవాణా చేస్తున్నారు. కఠిన నిబంధనలున్నా అవేమీ పట్టించుకోకుండా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇంత జరుగుతున్నా వాటిని నియంత్రించడంలో పోలీస్ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జేబులు నింపుకొంటున్న దళారులు

కొందరు చేపల చెరువుల యజమానుల స్వార్థం కారణంగా ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పు వాటిల్లితోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించాలనే దురాశతో కొందరు ఆక్వా చెరువుల యజమానులు చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. కొందరు దళారుల స్వార్థం ఈ అనర్థానికి కారణమవుతోంది. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదం అని తెలిసినా కోళ్లు, ఇతర జంతు వ్యర్థాలను దళారులు రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఉభయగోదావరి జిల్లాలోని పెరవలి, ఉంగుటూరు, ఆకువీడు, నారాయణపురం తదితర డెల్టా ప్రాంతాల్లో కొన్ని చెరువుల్లో చేపలకు మేతగా ఆహారంగా కోళ్ల, జంతు వ్యర్థాలను వేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుంచి కూడా వాహనాల్లో ఇక్కడకు రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా మాంసాహారం అధికంగా వినియోగించే ఉభయగోదావరి జిల్లాల్లోని కొన్ని మాంసం దుకాణాలు, చేపల మార్కెట్లలోని దుకాణదారులు వాటి వ్యర్థాలను డ్రమ్ముల్లో వేసి ఉంచుతారు. దుకాణదారులతో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం దళారులు వాటిని సేకరించి అక్రమంగా అధికారులు, పోలీసుల కళ్లు కప్పి రాత్రి వేళల్లో వ్యాన్లు, మినీ లారీలు, ఆటోల్లో చెరువుల వద్దకు రహస్యంగా తరలిస్తున్నారు.


డ్రమ్ముల్లో ఉంచిన కోళ్ల వ్యర్థాలు

మాంసం వ్యాపారులకు అదనపు ఆదాయం

చికెన్, మటన్ వ్యాపారులు దుకాణాల్లో ఉన్న వ్యర్థాలను వదిలించుకోవడానికి ఇంతకన్నా మరో సులువైన మార్గం లేక ఈ దళారులకు ఇస్తున్నారు. కోళ్లు, మేకల వ్యర్థాలను ఇచ్చినందుకు వ్యాపారులకు ఏడాదికి రూ. 10 నుంచి రూ.15 వేల వరకు దళారులు చెల్లిస్తుంటారు. దళారులు వీటిని తరలించి చేపల చెరువుల యజమానులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చేపల చెరువుల యజమానులు సాధారణ మేత ధర కంటే ఈ వ్యర్థాలు తక్కువ ధరకు రావడంతో కొన్ని రకాల చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ముఖ్యంగా ఫంగస్, రూప్ చంద్ రకాల చేపలకు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే

కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనం రోడ్డుపై వెళ్లిందంటే దాని దుర్వాసన భరించలేక సమీప నివాస గృహాల్లో ఉన్న ప్రజలు, వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాటి దుర్వాసనకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పలువురు వాపోతున్నారు.

ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువ

చేపలకు మేతగా డీవోబీ (నూనె తీసిన తవుడు), మొక్కజొన్న పిండి వినియోగిస్తుంటారు. దీని ధర ఎక్కువగా కావడం వల్ల ఆరు నెలలకు సగటున రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుంది. దీని స్థానంలో కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తే రూ. లక్ష లోపే ఖర్చవుతుంది. చేపల మేత కిలో రూ.35 వరకు ఉండగా కోళ్ల వ్యర్థాలు కిలో 10 రూపాయలకే రావడం వల్ల రైతుల వీటిపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఎకరా విస్తీర్ణంలోని చెరువులో చేపల పెంపకానికి నెలకు సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతుంది. 200 కిలోల కోళ్ల వ్యర్థాల డ్రమ్ము రూ. 2 వేలకు వస్తుంది. మేతకు వెచ్చించే పెట్టుబడి భారీగా తగ్గడం వల్ల రైతులు కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. నిబంధన ప్రకారం పట్టణాల్లోని మాంసం దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలను రోజు డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఎంతో కొంత లాభం వస్తుందనే ఆశతో వ్యాపారులు వీటిని డ్రమ్ముల్లో దాచి ఉంచి దళారులకు విక్రయిస్తున్నాను.

పర్యావరణానికి పెను ప్రమాదం

ప్రభుత్వం నిషేధించినా ఫలితం ఉండడం లేదు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదమైన కోళ్లు, ఇతర జంతు వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ దశాబ్దకాలం క్రితమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా కొందరు అక్రమార్కులు రహస్యంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. ఎక్కువగా అర్ధరాత్రి, తెల్లవారుజామున వీటిని తరలిస్తుండగా మరికొందరు పట్టపగలే తరలిస్తూ ప్రజలను నానా ఇబ్బంది పెడుతున్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపును అడ్డుకుంటాం



కోళ్ల వ్యర్థాల రవాణాపై గట్టి నిఘా పెట్టాం. పర్యావరణానికి అత్యంత హాని చేసే వీటిని రవాణా చేయడం చట్టరీత్యా నేరం. కోళ్ల వ్యర్థాలను రవాణా చేసే అక్రమార్కులపై నిఘా ఉంచి అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటాం. చేపల రైతులు కూడా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కోళ్ల, జంతు వ్యర్థాలను చేపల మేతగా వినియోగించవద్దు.

– పీవీజీ తిలక్, నిడదవోలు, సీఐ

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు


గౌరీపట్నంలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ జాన్‌పేటర్, భక్తులు


వేగేశ్వరపురంలో ర్యాలీలో పాల్గొన్న పాలిమేర జయరావు, జాన్, విశ్వాసులు

తాళ్లపూడి: గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో వాడవాడలా నిర్వహించారు. చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరిమేరి మాత పుణ్యక్షేత్రం నుంచి డైరెక్టర్ టి. జాన్ ఆధ్వర్యంలో గ్రామంలో సిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పాల్గొన్నారు. వేగేశ్వరపురం, తాళ్లపూడి వరకు వీధుల్లో సిలువ యాత్ర నిర్వహించారు. వేగేశ్వరపురంలోని లూథరన్ చర్చి, మలకపల్లిలోని క్రైస్ట్ కమ్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దేవం, తాళ్లపూడి, పైడిమెట్ట, ప్రక్కిలంక, అన్నదేవరపేటలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

డి.ముప్పవరంలో సిలువ యాత్ర

నిడదవోలు రూరల్: దైవకుమారుడిగా అవతరించిన ఏసు శిలువపై తన రక్తాన్ని చిందించి సర్వ మానవాళి పాపాలను తొలగించి విముక్తి కలిగించిన పవిత్రమైన రోజున గుడ్ ఫ్రైడే అని పాస్టర్ ఎం.చిట్టిరాజు వివరించారు. నిడదవోలు మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు శుభ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురుషోత్తపల్లి, సమిశ్రగూడెం, రావిమెట్ల, డి.ముప్పవరం గ్రామాల్లో క్రీస్తు వేషధారణలో సిలువ వేసే ఘట్టాలను విశ్వాసులు కళ్లకు కట్టినట్లు సిలువ యాత్రలు నిర్వహించారు. ఆర్సీఎం, పెంతుకోస్తు, లూథరన్, బైబిల్ మిషన్, జీడీఎం చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు ఆరాధనల్లో పాల్గొన్నారు.

నిడదవోలు: నియోజకవర్గంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని రాయిపేట మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరంగల్‌కు చెందిన మిషన్ ఇండియా బైబిల్ కళాశాల ప్రిన్సిపల్ రెవ. డాక్టర్ ప్రేమ్‌జిత్‌కుమార్ వాక్య సందేశం అందించారు.చర్చి చైర్‌పర్సన్ మెంటే దయారాజగిరి, పాస్టర్ రెవ. కె. కమలాకర్, పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ డిప్యూటీ కలెక్టర్ జి. మమ్మి, సుజ్ఞానరాజు, మెంటే ప్రియదర్శిని సంఘస్తులు పాల్గొన్నారు.

పట్టణంలో చర్చిపేటలోని కృపాధార సెంటినరీ లూథరన్ చర్చిలో గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఇవాంజిలిస్టు జె. రాజేష్‌కమల్ క్రీస్తు సిలువపై పలికిన సప్త సూక్తులను విశదీకరించారు. పాస్టర్ రెవ. బయ్యే ఆనంద్‌కుమార్, సహాయక పాస్టర్లు పాల్గొన్నారు. పట్టణంలో సెయింట్ ఆంబ్రోస్ విచారణ గురువు ఫాదర్ విజయకుమార్ ఆధ్వర్యంతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు సిలువ వేసిన సన్నివేశాలను ప్రదర్శిస్తూ బహిరంగ సిలువ మార్గం (ర్యాలీ) నిర్వహించారు. ఫాదర్ బత్తిన వరప్రసాద్, మఠ కన్యలు, ఉపదేశులు, విశ్వాసులు పాల్గొన్నారు.


గోపాలపురంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దైవజనులు


డి.ముప్పవరంలో సిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

ఏసుక్రీస్తును సిలువ వేసిన రోజు గుడ్ ఫ్రైడే

దేవరపల్లి: ఏసుక్రీస్తును సిలువ వేసిన రోజు గుడ్ ఫ్రైడే అని గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పేటర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పుణ్యక్షేత్రం ఆధ్వర్యాన గ్రామంలో శుక్రవారం సిలువ మార్గం యాత్ర నిర్వహించారు. సిలువను భుజాలపై పెట్టుకుని ఏసు నామాన్ని కీర్తిస్తూ జాన్‌పేటర్ యాత్ర నిర్వహించారు. సిలువ యాత్రలో ఫాదర్ జ్వానేష్, ఫాదర్ యేసుబాబు, ఫాదర్ గిరీష్, నిర్మలగిరి డిగ్రీ కళాశాల సిస్టర్లు, స్కూలు సిస్టర్లు, ఎల్‌ఏఆర్ సిస్టర్లు రోసిత, ప్రియవద, సునీత, దిరిసిన ఫాతిమా రాణి, గౌరీపట్నం సంఘస్తులు, ఏసు ప్రభువు మాల ధరించిన భక్తులు పాల్గొన్నారు.

యర్నగూడెంలోని ఆర్సీఎం చర్చి ఆధ్వర్యాన కూడా గ్రామంలో సిలువ మార్గం నిర్వహించారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ దానియేలు, సెయింట్ జోసెఫ్ స్కూలు కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ జసీ థామస్, సిస్టర్లు, యర్నగూడెం, సంగాయగూడెం, గాంధీనగరం, కృష్ణంపాలెం, చిన్నాయగూడెం గ్రామాల విశ్వాసులు సిలువ యాత్రలో పాల్గొన్నారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను ఫాదర్లు వివరించారు.

గోపాలపురం: గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గోపాలపురంలో సిలువతో శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ తిగిరిపల్లి గాబ్రియేలు అధ్వర్యంలో లూదరన్ చర్చిలో ప్రార్థనలు చేసి సిలువతో గ్రామంలో పర్యటించారు. మండలంలోని దొండపూడి, కొవ్వూరుపాడు, చిట్యాల, గోపవరం, గుడ్డిగూడెం, వాదాలకుంట గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రత్యేక ప్రార్థనలు

చాగల్లు: గుడ్ ఫ్రైడే సందర్భంగా చాగల్లు మండలంలో శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం చర్చిలో కె.సల్మన్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చాగల్లు, గౌరిపల్లి, మార్కొండపాడు, దారవరం, ఊనగట్ల, ఎస్ ముప్పవరం తదితర గ్రామాల్లోని చర్చిల్లో విశ్వాసులు ప్రార్థనలు చేశారు.

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: స్థానిక క్రీస్తు లూథరన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చి, తాడిపర్రు ఐబీఎం చర్చిల్లో క్రైస్తవ విశ్వాసులు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేలివెన్ను, కాల్ధారీతో పాటు పలు గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో ఆరాధనలు నిర్వహించారు.

క్రీస్తు మార్గం ఆదర్శప్రాయం

నల్లజర్ల: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని పుల్లలపాడులో ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఆంటోనీ, ఫాదర్ ఏసురత్నం ఆధ్వర్యంలో భక్తులు శుక్రవారం సిలువను మోసి భక్తిని చాటుకున్నారు. కె.చంటియ్య, జి.రమేష్ పాల్గొన్నారు. చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ మరపట్ల జోజి ఆధ్వర్యంలో, ప్రకాశరావుపాలెంలో ఫాదర్ విక్టర్, అనంతపల్లిలో నోవాక్, పోతవరంలో ఫాదర్ జాకబ్ స్వరాజ్ ఆధ్వర్యంలో, నల్లజర్లలో ఫాదర్ రాజేష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీరామమూర్తి
- గోపాలపురంలో పార్టీ శ్రేణులతో సమావేశం


గోపాలపురంలో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

గోపాలపురం: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అన్నారు. గోపాలపురంలో పార్టీ నాయకుడు కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద శుక్రవారం పార్టీ అనుబంధ సభ్యులు, ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. గడచిన తొమ్మిది నెలల కాలంలో ఒక్క పింఛన్ తప్ప.. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో మాజీ రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లిపూడి సలీం, యూత్ అధ్యక్షుడు వంగా మురళీకృష్ణ, నాయకులు ముల్లంగి శ్రీనివాస రెడ్డి, వింత ప్రసాద్‌రెడ్డి, పిన్నమనేని చినబాబు, పీతల ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దేవరపల్లి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యర్నగూడెం వద్ద గల 3ఎఫ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కార్మికులకు శుక్రవారం నిడదవోలు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఏర్పడే అగ్నిప్రమాదాలు, ఆయిల్‌పామ్ గెలలు, వాటి పీచు వలన అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన నివారణా చర్యలు, ప్రమాద నివారణ పరికరాలను వినియోగించే విధానం వివరించి, వాటి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ జనరల్ మేనేజరు కరుటూరి రామకృష్ణారావు, మేనేజరు అనపర్తి శివరామకృష్ణ, సీనియర్ హెచ్‌ఆర్ మేనేజరు శీతిరాజు బాలగాయత్రి, సేఫ్టీ ఆఫీసర్ హేమాచలం, అగ్నిమాపక దళ సిబ్బంది, ఫ్యాక్టరీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

కర్మాగారంలో ప్రదర్శన

కొవ్వూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆంధ్రా సుగర్స్ కర్మాగారంలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు-నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కర్మాగారం ఉద్యోగులకు, సిబ్బందికి స్థానిక ప్రజల సమక్షంలో వివిధ రకాల అగ్నిమాపక పరికరాల వినియోగం, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిమాపక అధికారి ఏపీఎస్ఎన్ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి


పెద్దేవంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తోట రామకృష్ణ

తాళ్లపూడి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలి సొమ్ము చెల్లించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ డిమాండ్ చేసారు. పెద్దేవంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు జనవరి నుంచి కూలి సొమ్ము చెల్లించటం లేదని కూలీలు తోట రామకృష్ణ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యపై కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళతామని, పరిష్కరించకుంటే, సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తానని తెలిపారు. పంచాయతీ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో గ్రామంలో ఈస్టర్ సందర్భంగా సమాధుల వద్ద ఉన్న చెట్లను, చెత్తను శుభ్రం చేశారు. దీనిపై ఉపాధి హామీ పథకం మండల ఏపీవో రమాదేవి మాట్లాడుతూ ఉపాధి కూలీల వేతనాలు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

బహుమతుల ప్రదానం

తాళ్లపూడి: గజ్జరంలో అంబేద్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు సర్పంచ్ గండి రాంబాబు చేతుల మీదుగా బహుమతులను శుక్రవారం అందజేశారు. వెల్ కేర్ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద సుమారుగా 1,500 మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, గ్రామస్తులు మరిచర్ల శ్రీనివాస్, పాలపర్తి రమణ, బోడిగడ్ల గోవిందు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ

దేవరపల్లి: మండలంలోని సంగాయగూడెం వద్ద పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగులగొట్టి రాగితీగను చోరీ చేశారు. యర్నగూడెం-సంగాయగూడెం రోడ్డులోని గాంధీనగరానికి చెందిన రైతు ఆచంట పెద్దశేషారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి పగులగొట్టి రాగితీగను దొంగిలించారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బోరు కింద పొగాకు, వరి పంటలు ఉన్నాయని, నీటి ఎద్దడి వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతు తెలిపారు. విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు


నిడదవోలు ఆర్టీసీ డిపోలో సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: ప్రయాణికుల సౌకర్యార్థం నిడదవోలు ఆర్టీసీ డిపోలో మెరుగైన సేవలందిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిడదవోలు- హైదరాబాద్ సూపర్ లగ్జరీ రెండవ సర్వీసును ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి దుర్గేష్ సతీమణి ఉషారాణి జ్ఞాపకార్థం పట్టణ జనసేన అధ్యక్షుడు రంగ రమేష్ ఆర్థిక సహకారంతో ఆర్టీసీ డిపోకు ఎనిమిది పెద్ద సైజు డస్ట్ బిన్లను ఏర్పాటు చేశారు. వీటిని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం, డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇసుక వాగు డ్రైనేజీ పరిశీలన


దేవరపల్లిలో ఇసుక వాగు డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి: గ్రామ నడిబొడ్డున దుర్గంధం వెదజల్లుతున్న ఇసుక వాగు డ్రైనేజీని శుక్రవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాగు అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణం, చెరువుల సుందరీకరణ పనులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇసుక వాగు డ్రైనేజీ నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.80 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. డ్రైనేజీ నిర్మాణం, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మూడు మీటర్ల డ్రైనేజీని ఆరు మీటర్లకు విస్తరణ, పూడికతీత పనులు చేపడతారని చెప్పారు. రెండో దశలో స్టేట్ బ్యాంక్ వద్ద, పోతనకుంట చెరువు సుందరీకరణ పనులు చేపడతారన్నారు. రూ.2 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఊర చెరువు సుందరీకరణ, గట్టు రోడ్లను విస్తరించనున్నట్టు వివరించారు. డ్రైనేజీ నిర్మాణంపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో చర్చించారు. దేవరపల్లిలో ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


కొవ్వూరులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కంఠమణి రమేష్‌బాబు, ముదునూరి నాగరాజు

కొవ్వూరు: స్థానిక ఎన్‌టీఆర్ క్రీడాప్రాంగణంలో శుక్రవారం రాజు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజు ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంటును వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, నాయకులు ముదునూరి నాగరాజులు ప్రారంభించా రు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంటులో వివిధ ప్రాంతాలకు చెందిన 15 టీములు పాల్గొంటాయన్నారు. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.12వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకి రూ.5వేలు చొప్పున నగదు పారితోషికం అందిస్తామని తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 208 మంది హాజరు

కొవ్వూరు: పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇం టర్వ్యూలకు పది జిల్లాలకు చెందిన 208 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ బహుళ జాతి ఫార్మ కంపెనీలతో పాటు ఎంఎస్ఎన్ ఫార్మాస్యూటికల్స్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. ఎమ్మెస్సీ రసాయన శాస్త్రం, బీ ఫార్మసీ విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. దీనిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మళ్లీ రాతపరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి మౌఖిక పరీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామ్మోహన్, ఎంఎస్ఎన్ ఫార్మా ప్రతినిధులు, వైస్‌ప్రిన్సిపల్ వై.రమేష్ పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన తలారి

చాగల్లు: మండలంలో గరప్పాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంట్లో జరిగిన వివాహానికి మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు శుక్రవారం హాజరయ్యారు. గ్రామానికి చెందిన అల్లు ధనంజయ్ కుమార్తె వివాహ వేడుక సందర్భంగా నూతన వధువరులను తలారి వెంకట్రావు ఆశీర్వదించారు. సర్పంచ్‌లు కుదప రాంబాబు, ముప్పిడి మహాలక్ష్ముడు పాల్గొన్నారు.